క్లుప్తంగా

అమ్మవారికి 43 రకాల స్వీట్లతో నైవేద్యం



ముసలమ్మ వారికి స్వీట్లతో అలంకరణ

కడియం: కడియపులంక గ్రామ దేవత ముసలమ్మ అమ్మవారికి దీపావళిని పురస్కరించుకుని 43 రకాల స్వీట్లను శుక్రవారం భక్తులు నైవేద్యంగా సమర్పించారు. వాటితో అమ్మవారిని సుందరంగా తీర్చిదిద్దారు. ఇలా నాలుగేళ్లుగా అలంకరణ చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

వ్యక్తి మృతదేహం గుర్తింపు

కడియం: జేగురుపాడు శివారులోని పొలాల్లో సుమారు 40–45 ఏళ్ల వయసు గల పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్లు కడియం పోలీసులు తెలిపారు. ఈ మృతదేహం పూర్తిగా పాడైంది. ఒంటిపై నలుపు రంగు ఫ్యాంట్, స్కై బ్లూ కలర్‌పై నలుగు నిలువు చారల పొడవు చేతుల చొక్కా ఉంది. తల భాగం పాడైపోయి, గుర్తు పట్టడానికి వీల్లేకుండా ఉంది. చుట్టుపక్కల వారిని విచారించగా ఎటువంటి సమాచారం లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. దీంతో పొలం యజమాని వి.రత్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వెండి తొడుగు సమర్పణ



పూజల్లో పాల్గొన్న చందన కుటుంబ సభ్యులు

సీటీఆర్‌ఐ: స్థానిక సారంగధర మెట్టలో వెలసిన కాళేశ్వరీ సమేత బాలాత్రిపుర సుందరి కాళికాంబ భద్రకాళీ దేవస్థానానికి ఐదు కిలోల వెండితో తయారు చేసిన తొడుగును రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ శుక్రవారం సమర్పించారు. అదే విధంగా గోదావరి గట్టున ఉన్న ఉజ్జీయనీ మహా కాళేశ్వరాలయంలోని శివలింగానికి 20 కిలోల వెండి తొడుగును అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చందన రమేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులకు గురైన వారికి సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో పిడింగొయ్యికి చెందిన చిచారి నారాయణ మూర్తికి రూ.2,40,509, తొర్రేడుకు చెందిన పెనుమర్తి వరలక్ష్మికి రూ.40,524లు సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు.

తెలుగు ప్రజల ఆత్మ గౌరవం శ్రీరాములు

సీటీఆర్‌ఐ: అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల ఆత్మ గౌరవమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక డీలాక్స్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

దీపం పథకం ప్రారంభం

ధవళేశ్వరం: స్థానిక పోలీస్ స్టేషన్ వీధిలోని ధవళేశ్వరం గ్యాస్ కంపెనీ వద్ద శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్ దీపం–2 పథకాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు పందూరి అప్పారావు, తలారి మూర్తి, ఆళ్ల ఆనందరావు పాల్గొన్నారు.

సర్వర్ పనిచేయక అగచాట్లు

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ మండలంలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వర్ సమస్య ఎదురైంది. చివరికి రాత్రి 8 గంటలలోపు 95.59 శాతం పంపిణీ జరిగిందని ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం నుంచి సర్వర్ సరిగ్గా పనిచేయక మధ్యాహ్నానికి 50 శాతం మాత్రమే పింఛన్ల పంపిణీ జరిగింది. మధ్యాహ్నం నుంచి సర్వర్ పనిచేయడంతో సచివాలయ ఉద్యోగులు రాత్రి 8 గంటల వరకూ పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 19,703 మంది లబ్ధిదారులకు రూ.8.49 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 18,834 మందికి రూ.8.12 కోట్లు అందజేశారు.

ఆటల్లో అదరహో..

- సత్తా చాటుతున్న విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పిస్టల్ షూటింగ్‌లో పతకాలు కైవసం చేసుకున్న విద్యార్థినులు

ప్రకాశంనగర్: ఆటల్లో అదరగొడుతున్నారు.. ప్రతిభను చాటుతూ అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు.. రాజమహేంద్రవరం నగరంలోని పలువురు విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉండడం విశేషం. కేవలం క్రీడలపై ఆసక్తితో తమ ప్రతిభకు పదును పెట్టి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. దీంతో పాటు క్రీడా పోటీల్లో రాజమహేంద్రవరం ఖ్యాతిని దశదిశలా చాటేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ వంటి సాధారణ క్రీడలతో పాటు పరుగు, ఈత వంటి క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి పలు పతకాలను కైవసం చేసుకుంటున్నారు.

ప్రశంసలు.. పతకాలు

స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న బి.తనిష్క, బీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థిని ఎస్.హారిక ఇటీవల ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ ఎట్ క్రికెట్ జట్టు ఎంపిక పోటీలో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించారు. వీరు నవంబర్ 11న మైసూర్‌లో జరిగే సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. పిస్టల్ షూటింగ్‌లో ఇదే కళాశాలకు చెందిన ఎస్.ఉమాభార్గవి నన్నయ యూనివర్సిటీ ఎట్ సెలక్షన్‌లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, ఎస్.బిందు మాధవి రెండో స్థానం సాధించి రజత పతకం గెలుచుకుంది. వీరు చండీఘర్‌లో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 జిల్లా స్థాయి త్రోబాల్ సెలక్షన్‌లో సిటీ మున్సిపల్ స్కూల్ విద్యార్థి నాగ చైతన్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ప్రభుత్వ సహకారం అంతంత మాత్రమే..

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వ సహకారం అంతంత మాత్రంగానే ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు అనేక పోటీలను నిర్వహించింది. సత్తా చాటిన క్రీడాకారులకు కిట్‌లను అందించడంతో పాటు విజేతలకు నగదు బహుమతులను ప్రదానం చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆయా పీడీలు కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం సహకారం అంతంత మాత్రంగానే ఉండడంతో పాటు నిధుల లేమి వంటి కారణాలతో విద్యార్థులు చదువుకు మాత్రమే పరిమితమవుతున్నారు. మంచి శిక్షణతో క్రీడా మెళకువలు నేర్పిస్తే క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

రాణిస్తే మంచి భవిష్యత్తు



క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుంది. చిన్న వయసులోనే విద్యార్థులకు వారికి నచ్చిన క్రీడలో శిక్షణ ఇవ్వడం ద్వారా అందులో మెరికల్లా తయారవ్వడానికి అవకాశం ఉంటుంది. క్రీడలతో శరీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాల్సిన అవశ్యకత ఉంది.

– ఎస్ఆర్‌కేవీ స్వామి, జిల్లా క్రీడా సమాఖ్య నిర్వహణ కార్యదర్శి

ప్రోత్సహిస్తే పతకాలు



నేను సిటీ మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాను. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రోత్సహించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ప్రభుత్వం సహకారంతో మంచి శిక్షణ అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించాలనేదే నా ఆకాంక్ష.

– నాగ చైతన్య, విద్యార్థి

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా నగరంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ రంగ్రీజు పేట, మెయిన్ రోడ్డు, గుండువారి వీధి, ఖాజీ వీధి, పుష్కరఘాట్, పప్పుల వీధి, సీతమ్మ సందు, ఆనప పిండివారి వీధి, కమిటీ హాలు, దాసరి వీధి, బీఆర్‌కే షాపింగ్‌మాల్, వరమహాలక్ష్మి పట్టుచీరలు, పెరుమాళ్లు పట్టువస్త్రాలు, కంకటాల, ఖజానా షాపింగ్ మాల్స్, మొహమ్మద్ ఖాన్ అండ్ సన్స్ జ్యూయలర్స్, నారాయణి సిల్క్స్, కందకం రోడ్, జెండాపంజా రోడ్, గంటాలమ్మ గుడి వీధి తదితర ఏరియాలకు ప్రభావం ఉంటుందన్నారు.

నేడు రూరల్‌లో అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ శుక్రవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి 1 వరకూ బొమ్మూరు, మురళీకొండ, వెంకటగిరికొండ, ఎంఆర్‌టీ స్టోర్స్, కొత్తపేట, ఏఎంజీ సోమనవారి తోట, జీపీఆర్ రోడ్డు, పాత బొమ్మూరు ప్రాంతాల్లో సరఫరా ఉండన్నారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు రాష్ట్ర శెట్టిబలిజ వనభోజన మహోత్సవం



సమావేశంలో పాల్గొన్న శెట్టిబలిజ సంఘీయులు

సీటీఆర్‌ఐ: రాష్ట్ర శెట్టిబలిజ వనభోజన మహోత్సవాన్ని, శెట్టిబలిజ వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదికను ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. వనభోజన మహోత్సవ ప్రచార రథాన్ని శుక్రవారం ఉదయం స్థానిక బెస్ట్ ప్రైస్ పక్కన ఉన్న చెరుకూరి తోటలో నాయకులు ప్రారంభించారు. ఆ తోటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ నాయకుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి సంఘీయులంతా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం నగర సమీప ప్రాంతాల్లో ఈ వ్యాన్ ద్వారా వనభోజన మహోత్సవం, ఉచిత వివాహ పరిచయ వేదిక గురించి ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంఘీయులంతా పాల్గొంటారన్నారు. మహిళలు, పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మట్టపర్తి సత్యనారాయణ, ఆనెం చిన్న, యర్రా మల్లేశ్వరరావు కొప్పిశెట్టి నాగేంద్ర, మునసా అప్పారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, బత్తిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్తిక వన సమారాధన

రాజమహేంద్రవరం రూరల్: బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యుల కార్తిక వన సమారాధన ఈ నెల 3వ తేదీ ఆదివారం మోరంపూడి నుంచి శాటిలైట్‌సిటీకి వెళ్లే దారిలో పిల్లి శ్రీనివాసరావు తోటలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ కృష్ణారావు, సిరికి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వన సమారాధనకు ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు హాజరవుతారన్నారు. రాష్ట్ర సంఘ కమిటీ, తూర్పుగోదావరి జిల్లా కమిటీలచే ఆటల పోటీలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘంలో ఉన్న ప్రతి సభ్యుడు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు.

దీపావళి కాంతులు నింపాలి



బాలికలతో దీపావళి జరుపుకొంటున్న షర్మిలారెడ్డి

సీటీఆర్‌ఐ: దీపావళి పండగ పిల్లల జీవితాల్లో కాంతులు నింపాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. గురువారం దీపావళిని పురస్కరించుకుని స్థానిక ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ఉన్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ బాలిక సదనం హాస్టల్‌లో ఉన్న బాలికలతో దీపావళిని ఘనంగా జరిపారు. పిల్లలకు దీపావళి సామాన్లు పంచిపెట్టారు. వారితో పాటు కలిసి షర్మిలారెడ్డి కూడా క్రాకర్స్ కాల్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదనం హాస్టల్ ఉన్న బాలికలతో కలిసి దీపావళి చేసుకోవడం ఆనందం కలిగించిందన్నారు.

తెలుగు కవిత్వపు తోటమాలి దేవులపల్లి



కృష్ణశాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజబాబు తదితరులు

సీటీఆర్‌ఐ: మాట్లాడే భాషకు హృదయవీణలద్ది, తేట తెలుగు పదాలతో, సినిమా పాటలను మూడు దశాబ్దాల పాటు హిమవత్ శిఖరంపై నిలిపిన అరుదైన కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒకరిని ముఖ్య వక్త, నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు తరపట్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి సంయుక్త నిర్వహణలో దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి కోయిలలు ఒక్క గొంతుతో తెలుగు పాట పాడితే ఎలా ఉంటుందో, దేవులపల్లి పాటను విని మనం అనుభూతి చెందవచ్చన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ లాలిత్యం, సరళ్యం, ప్రకృతి సౌందర్యం, కృష్ణశాస్త్రి కవిత్వంలోని ప్రధాన లక్షణాలన్నారు. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసిన ఘనత కృష్ణశాస్త్రికే దక్కుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో పి.సుధ, ఎస్.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు డైరెక్టర్‌కు అభినందన



టీటీడీ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ అక్కిన మునికోటేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల, తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులు కావడం ఆనందంగా ఉందని టీటీడీ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ అక్కిన ముని కోటేశ్వరరావు అన్నారు. ప్రముఖ వ్యాపార వేత్త, ది రాజమండ్రి కాస్మోపాలిటిన్ క్లబ్ సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావు టీటీడీ ట్రస్ట్ బోర్డు కార్యవర్గ సభ్యులుగా నియమితులు కావడంతో శుక్రవారం నగరంలో ఆయన నివాసంలో క్లబ్ సభ్యులు దుశ్శాలువా, పూల బొకేలతో సత్కరించారు. కార్యక్రమంలో ది రాజమండ్రి కాస్మోపాలిటన్ క్లబ్ కార్యవర్గ ప్రధాన కార్యదర్శి బలుసు అమ్మిరాజు చౌదరి, కార్యవర్గ సభ్యులు కోసూరి సుబ్బరాజు, కోడూరి గౌతమ్‌చౌదరి, టి.శ్రీనివాస్ యాదవ్, గన్ని శ్రీనివాస్, పరిమి వాసు పాల్గొన్నారు.


విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కంబాలచెరువు: స్థానిక సీతంపేటలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రిన్సిపాల్ పి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల దంతాలను పరీక్షించి వారికి వైద్యులు సూచనలు ఇచ్చారు. విద్యార్థుల దంత సమస్యలకు వైద్యులు సమాధానాలు చెప్పారు. స్కూల్ ఏజీఎం ఎంవీ సురేష్, రీజనల్ ఇన్‌చార్జ్ వి.ఉదయ్‌శంకర్, జోనల్ కో–ఆర్డినేటర్ కిరణ్‌పాండే, డీన్ సాయికిరణ్, సి.ఇన్‌చార్జ్ కుసుమ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

4 నుంచి ఫ్లషింగ్ ఆపరేషన్



తూర్పు డెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద నిర్వహిస్తున్న ఫ్లషింగ్ ఆపరేషన్ (ఫైల్)

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు సంబంధించి ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకూ ఫ్లషింగ్ ఆపరేషన్ నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. సోమవారం పశ్చిమ డెల్టా, మంగళవారం మధ్య డెల్టా, బుధవారం తూర్పు డెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద ఫ్లషింగ్ ఆపరేషన్ చేస్తామన్నారు. వరదల సీజన్‌లో గేట్ల వద్దకు వచ్చి చేరిన మట్టి, చెత్త ఫ్లషింగ్ ఆపరేషన్ ద్వారా దిగువకు కొట్టుకుపోతుందన్నారు. దీని ద్వారా రానున్న రబీలో నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ఉంటాయని ఈఈ వెల్లడించారు.

నగరంలో పచ్చదనాన్ని పెంపొందించాలి



నగరంలో డివైడర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పార్కులు, డివైడర్లలో పచ్చదనాన్ని పెంపొందించాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక జవహర్ లాల్ నెహ్రూ రోడ్, ఏవీ అప్పారావు రోడ్, కంబాలచెరువు, ఏకేసీ కాలేజ్ పార్కు, భాస్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచి నగరాన్ని పర్యావరణ హితంగా తయారు చేయాలని, పార్కుల్లో మొక్కలు, లాన్‌లను శ్రద్ధగా పెంచాలన్నారు. పార్కుల్లో పనిచేసే సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఎమినిటీస్ కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలోని పార్కులు, డివైడర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ మొక్కల నిర్వహణ సక్రమంగా ఉండేట్టు చూడాలన్నారు. జవహర్ లాల్ నెహ్రూ రోడ్, ఏవీ అప్పారావు రోడ్లలోని ఫుట్‌పాత్‌లు దెబ్బతినకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఇబ్బంది ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. రోడ్లు వేసిన తరువాత సైడ్ బెర్ములు కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. భాస్కర్‌నగర్‌లో పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలను వెంటనే తయారు చేయాలన్నారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ మదర్సా అలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.ప్రసాద్, లోవరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కె.స్వాతి, అసిస్టెంట్ ఇంజినీర్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తికమాస ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని గౌరీచంద్రమౌళీశ్వర ఆలయంలో శనివారం నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు కార్తిక మాస విశేష పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. శనివారం సాయంత్రం ఆకాశ దీపం ప్రారంభం, ఈ నెల 4, 11, 18, 25 తేదీలలో కార్తిక సోమవారాలు స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు ,సాయంత్రం పల్లకి సేవలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 5వ తేదీ నాగులచవితి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, 15వ తేదీ శుక్రవారం కార్తిక పౌర్ణమి రోజున స్వామివారికి అభిషేకాలు, దీప, దానాలు, సాయంత్రం 7.30 గంటకు జ్వాలాతోరణ సేవ జరుగుతుందన్నారు. 17న లక్ష దీపోత్సవం, 29న మాసశివరాత్రి విశేష అభిషేకాలు, లక్షబిల్వార్చన, డిసెంబర్ ఒకటో తేదీన కార్తికమాస అన్న సమారాధన, రెండో తేదీన పోలిస్వర్గం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ కోరింది.

కడియం మండల ప్రాథమిక వైద్యుల ఫోన్ నంబర్లు

పి.దేవానందం, వీరవరం	:	98660 04454
బుడిత గోపాలకృష్ణ, వీరవరం	:	96181 28583
సుధా దేవీవరప్రసాద్, దామిరెడ్డిపల్లి	:	99513 27110
సీహెచ్ఎస్ఎస్‌బీ కామరాజు, వేమగిరి	:	98486 15360
సీహెచ్ విష్ణుశ్వరరావు, వేమగిరి	:	93947 45560
గుబ్బల శ్రీనివాస్, వేమగిరితోట	:	90008 16628
షేక్ నూర్జహాన్, వేమగిరి	:	96525 36983
సీహెచ్ నరసింహారావు, వేమగిరి	:	97041 93499
గట్టి శ్రీనివాస్, వేమగిరి	:	95507 27808
మచ్చా సుబ్రహ్మణ్యం, వేమగిరి	:	90308 28462
వై.దుర్గారావు, వేమగిరి	:	98665 93898
ఉండ్రాసపు ప్రసాద్‌బాబు, కడియం	:	99493 63242
కేశవదాసు వెంకటనారాయణ శర్మ, కడియపుసావరం	:	93910 05334
సుంకర శ్రీనివాసరావు, మాధవరాయుడుపాలెం	:	98494 69100
షేక్ రెహ్మాన్‌సాహెబ్, జేగురుపాడు	:	98660 06787
తిరునామాల సుదర్శనం, జేగురుపాడు	:	99493 59118
పీవీ నాగసత్యనారాయణ, మురమండ	:	98665 93916
గంపల భానుప్రకాష్, మురమండ	:	98663 27915
కాకరపర్తి మరిడయ్య, దుళ్ల	:	99855 63382
మేకా పార్థసారథి, దుళ్ల	:	99122 09855
కంచిపాటు కొండబాబు, దుళ్ల	:	97052 18843
సాదే శ్రీనివాసరావు, దుళ్ల	:	90002 64616
ఎంవీఎంఆర్. సుబ్రహ్మణ్యం, వేమగిరి	:	99632 12809
పరిమి స్వామిబాబు, కడియపులంక	:	93933 89113

సినిమాలు



శ్యామల	:	బఘీర
సూర్యమినీ	:	జనక అయితే గనక
సూర్యప్యాలెస్	:	లక్కీ భాస్కర్
శివజ్యోతి	:	క
అనుశ్రీ	:	క
స్వామి	:	అమరన్
అశోక	:	లక్కీ భాస్కర్
రాజా	:	అమరన్
రంభ	:	భూల్‌భులాయియా–3
ఊర్వశి	:	అమరన్
మేనక	:	విశ్వం
కుమారి	:	దేవర
అప్సర	:	లక్కీ భాస్కర్
నామవరం		
వీఎస్ మహల్	:	లక్కీ భాస్కర్, క
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	లక్కీ భాస్కర్
కడియం		
వెంకటసూర్య	:	లక్కీ భాస్కర్

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మహిళలతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్ఐ ప్రసన్న తదితరులు

కడియం: నర్సరీల్లో పనులకు వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. నర్సరీ పనులకు వెళ్లే మహిళలకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా కాకుండా అందరూ కలిసి వెళ్లడం ఉత్తమమన్నారు. ఎవరైనా అసభ్యకంగా ప్రవర్తించినా, అనుమానాస్పదంగా తిరిగినా వెంటనే 112కి కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ఎస్సై ధనలక్ష్మీ ప్రసన్న, మహిళా రక్షక్ టీం సభ్యులు పాల్గొన్నారు.